ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
గురువారం 26 సెప్టెంబరు 2024



గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	49,234	46,120
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.179)	3390.14	3240.77
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.86 (45.56)	33,460	36,950

చికెన్ ధరలు | లైవ్ : రూ.158 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



కాగితరాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వకు పూర్తయిన గండిపూడ్చివేత

హమ్మయ్య.. గండి పూడ్చారు

- 132 కిలోమీటర్ వద్ద గండిపూడ్చిన అధికారులు
- మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు నీటి విడుదల
- రక్షణ కోసం గండిపడిన చోట ఇసుక బస్తాలు పరిచిన అధికారులు
- ఆనందంలో ఆయకట్టు రైతులు

భారీ వర్షాలకు నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురం వద్ద సాగర్ ఎడమకాల్వకు పడిన గండిని అధికారులు పూడ్చివేశారు. ఈ నెల 1వ తేదీన పాలేరు రిజర్వాయర్ వరద వెనక్కి రావడంతో 132, 134 కిలోమీటర్ల వద్ద కాల్వకు గండ్లుపడ్డాయి. వరుసగా వర్షాలు కొనసాగడంతో పనులకు ఆటంకం కలిగింది. ఇటీవల రెండు పర్యాయాలు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గండిపడిన ప్రదేశాలను సందర్శించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించడంతో బుధవారం సాయంత్రానికి అధికారులు పూడ్చివేత పనులు పూర్తి చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 25 రోజుల తర్వాత మునగాల హెడ్‌రెగ్యులరేటర్ నుంచి కాగితరాంచంద్రాపురం వైపు ఎడమకాల్వలోకి నీటిని విడుదల చేశారు.

- హుజూర్‌నగర్

జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31, ఈ నెల 1వ తేదీన భారీ వర్షాలు కురిసాయి. ఎడమకాల్వ పరిధిలోని నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపంలో 132 కిలోమీటరు వద్ద ఈ నెల 1న కాల్వకు గండిపడింది. సుమారు 50 వేల ఎకరాల్లో పంట సాగు పరిస్థితి అగమ్యగోచరమైంది. కాల్వ గండి పనులు మొదలు కావడం ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో మంత్రుల బృందంతో పాటు జిల్లా మంత్రి ఉత్తమ్ పలు పర్యాయాలు గండ్లు పడిన ప్రదేశాలను సందర్శించారు. పనులను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు శ్రమించి బుధవారం సాయంత్రానికి గండ్లను పూడ్చివేశారు.

600 క్యూసెక్కులు విడుదల

బుధవారం సాయంత్రం ఆరు గంటలకు మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని ఎన్‌ఎస్‌పీ చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. క్రమక్రమంగా నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచుతామని అధికారులు తెలిపారు. 115వ కిలోమీటరు మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం 132 కిలోమీటరు నుంచి నాయకన్‌గూడెం 134 కిలోమీటరు మీదుగా పాలేరు రిజర్వాయర్‌కు నీటి సరఫరా జరుగుతుంది. 128 కిలోమీటర్ వద్ద మట్టికట్ట(క్రాక్‌బండ్)ను తొలగించి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కాల్వ పరిధిలోని 50 వేల ఎకరాల పంట ఎండిపోకుండా అధికారులు కాపాడగలిగారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారీనీటిపారుదల శాఖ మంత్రిగా ఉండటంతో ఎడమ కాల్వ గండ్ల పనులను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం సమీపంలోని 134 కిలోమీటరు వద్ద సైతం గండిపడగా అక్కడ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుమారు 10 అడుగుల ఎత్తులో కాంక్రీట్ గోడను నిర్మించారు. దీంతో పాలేరు రిజర్వాయర్‌కు ఎటువంటి ఆటంకం లేకుండా నీటి సరఫరా అవుతుందని అధికారులు తెలిపారు. కాల్వకు గండిని పూడ్చిన అధికారులు కట్టలు మరోసారి తెగకుండా ఉండేందుకు ప్రొటెక్షన్ కోసం 70శాతం ఇసుక బస్తాలను ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా జిల్లాలోని మునగాల హెడ్‌రెగ్యులేటర్ 115 కిలోమీటర్ నుంచి కొత్తగూడెం, కొమరబండ, పాలారం మేజర్ల పరిధిలోని సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టుకు, ఎత్తిపోతల పథకాల కింద ఉన్న మరో 15వేల ఎకరాల ఆయకట్టుకు ఐదు రోజులుగా 128 కిలోమీటరు వద్ద మట్టికట్ట వేసి నీటిని సరఫరా చేశారు.

50 వేల ఎకరాలపై ప్రభావం

సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కృష్ణా జిల్లాలో పరిధిలో సుమారు 10లక్షల ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది. అదేవిధంగా జిల్లాలో సాగర్ ఎడమకాల్వ పరిధిలో 2.29 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నడిగూడెం మండలంలో కాగితరాంచంద్రాపురం వద్ద కాల్వకు గండిపడటంతో సుమారు 50 వేల ఎకరాలకు నీరందలేదు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేసిన అధికారులు కొత్తగూడెం, కొమరబండ, పాలేరు మేజర్ల పరిధిలోని పంటలకు నీరు అందజేయడంతో పాటు ఎత్తిపోతల పథకాలకు కూడా మట్టి కట్ట వేసి నీటిని సరఫరా చేశారు. అయితే కాల్వకు గండ్లు పడటంతో నీటి సరఫరాకు అంతరాయం కలగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. గండిపూడ్చిన నేపథ్యంలో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం

రైతులు ఆందోళన చెందవద్దు: మంత్రి ఉత్తమ్



ఆయకట్టు చివరి భూముల వరకు సాగుకు నీరందిస్తామని, రైతుల ఆందోళన చెందవద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాగితరామచంద్రాపురం వద్ద గండిని పూడ్చివేసి ఆయకట్టుకు నీటిని విడుదల చేశామన్నారు. ప్రతీ ఎకరాన్ని కాపాడతామన్నారు. ప్రతిపక్షాలు వరద రాజకీయాలు చేస్తున్నాయన్నారు. వరదలు వచ్చిన గంట నుంచి ప్రజల కోసం నిరంతరం పనిచేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు తాను, మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించిందన్నారు. నిధులు కేటాయించి పనులు పూర్తి చేశామన్నారు. త్వరలోనే చెరువుల గండ్లు కూడా పూడ్చివేస్తామన్నారు. ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

గండిపూడ్చివేత పూర్తికావడంతో మట్టికట్టలను తొలగించి నీటిని పూర్తిస్థాయిలో కిందికి వదిలారు.

ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లోనూ..

సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మొదటి జోన్‌లో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఈ నెల 1న 14వ కిలోమీటర్ వద్ద గండిపడింది. అధికారులు ఈ నెల 20వ తేదీన పూడ్చివేత పనులు పూర్తిచేసి నీటిని విడుదల చేశారు. ఎన్ఎస్పీ అధికారులు పనులు దగ్గరుండి పూర్తి చేయించారు.



ఎక్స్‌కవేటర్‌తో మట్టికట్టను తొలగింపు



హైదరాబాద్‌లో జిల్లా నేతలతో సమావేశమైన కేటీఆర్

ప్రజా సమస్యలపై పోరాడుదాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పార్టీ బలోపేతానికి, ప్రజాసమస్యలపై పోరాటాలకు దిశానిర్దేశం

త్వరలో ముఖ్యనేతలతో నియోజకవర్గాల్లో పర్యటిస్తానని హామీ

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి నివాసంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఉద్యమిద్దామని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ నేతలు చేస్తున్న అరాచకాలపై ఎక్కడికక్కడ నిలదీద్దామన్నారు. త్వరలో పార్టీ నేతలతో కలిసి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేదిశగా కార్యాచరణ చేపట్టాలన్నారు. కార్యకర్తలకు ధైర్యమిచ్చేలా కార్యక్రమాలు నిర్వహించి, వారికి అండగా ఉండాలన్నారు. కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అధికార, అహంకారదర్పంతో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారని, వారి ఆగడాలను ప్రజలకు వివరించాలన్నారు.

జిల్లాలో ఫ్లోరోసిస్ మళ్లీ పెరిగింది

జిల్లాలో ఫ్లోరోసిస్ మళ్లీ పెరిగిందని, తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయని కేటీఆర్ అన్నారు. పంచాయతీల నిర్వహణను గాలికొదిలేశారని, ప్రజలు సమస్యల్లో ఉన్నారని వివరించారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారి సమస్యల తరఫున బీఆర్ఎస్ నిలబడి పోరాడుతుందన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గాల్లోని సమస్యలతోపాటు కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలిని కేటీఆర్ దృష్టికి తెచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలందరి అభిప్రాయాలను విన్న కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎం.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, గొంగిడి సునీతారెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్లశేఖర్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, భిక్షమయ్యగౌడ్, జడ్పీ మాజీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, సందీ‌ప్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, దయాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలకు అధిక దిగుబడులు



చిల్లేపల్లి వద్ద వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

నేరేడుచర్ల, సెప్టెంబరు 25 : వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిల్లేపల్లి గ్రామంలో వరి సాగు చేసే పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వరి సాగులో సస్యరక్షణ చర్యల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పైరుకు ఆశించే చీడపీడలు కలిగే నష్టాలు వాటిని ఏవిధంగా నివారించాలో రైతులకు అవగాహన కల్పించారు. సకాలంలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని, పంటకు సరిపోను ఎరువులను మాత్రమే ఉపయోగించాలని, అధికమైతే అనర్థమని తెలిపారు. కార్యక్రమంలో ఏవో జావిద్, ఏఈవో నిర్మల, రైతులు పాల్గొన్నారు.



ప్రమాదకర చెరువు కట్టపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు

ప్రయాణం.. ప్రమాదం

కోదాడ మండలంలోని యర్రవరం గ్రామంలోని శివదేవునికుంట చెరువు కట్ట తెగిపోయి సుమారు 20 రోజులు కావస్తున్నా అధికారులు కట్టను పూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రమాదకర పరిస్థితుల మధ్య కట్ట పైనుంచి గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. 40అడుగుల మేర తెగిన కట్టపై మట్టి పోశారు. ఆ కట్టపైనే ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి కట్ట మీద నుంచి రాకపోకలు సాగించాలన్నా ఒకరు వెళ్లిన తరువాత మరొకరు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వెంటనే నిధులు మంజూరు చేసి చెరువు కట్ట మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

- కోదాడ రూరల్

7వ పేజీలో

11 మంది ఎస్ఐలకు స్థానచలనం

గ్రామాల్లో ఇన్‌చార్జిల పంచాయితీ

ఇసుక మాయాజాలం

- మోతె మండలం నుంచి ఇతర జిల్లాలకు ఇసుక తరలింపు
- సీజ్ చేసిన ఇసుక మాయం
- ట్రాక్టర్‌కు రూ.10 వేలు డిమాండ్

30 నుంచి మట్టపల్లిలో పవిత్రోత్సవాలు

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



మట్టపల్లిలో పవిత్రోత్సవాలకు ముస్తాబైన మహాక్షేత్రం(ఇన్‌సెట్‌లో స్వామి, అమ్మవార్లు)

మఠంపల్లి, సెప్టెంబరు 25 : మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. అక్టోబరు 3వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే విద్యుద్దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఏడాది పొడవునా స్వామివారికి నిర్వహించే అర్చనాదులు, ఇతర సేవల్లో జరిగే దోషాల పరిహారార్థం ఏటా ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆలయ ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌లు బుధవారం విలేకరులకు వివరించారు. 30వ తేదీ ఆదివారం రాత్రి యాజ్ఞికుల దీక్షాధారణతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. తమిళనాడులోని శ్రీస్వాతీనక్షత్ర మహాయజ్ఞ వాటిక ట్రస్ట్ చైర్మన్ ముక్కూరు శ్రీనివాసన్ పంపించిన పవిత్రాలను ఆలయానికి చేరుస్తారని తెలిపారు. అనంతరం అఖండ దీపారాధన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వాస్తుహోమాలు, పంచగవ్యరాధనలు నిర్వహించాక క్షీర గుణాధివాస ప్రోక్షణ ఉంటుందన్నారు. శయనాధివాసం, అగ్ని ప్రతిష్టాపనల తదుపరి మహాశాంతి హోమం, చతుర్వేద పారాయణం, ఇతిహాస పురాణాలు పఠిస్తారని తెలిపారు. యాజ్ఞికులు బుర్రా వాసుదేవాచార్యుల నేతృత్వంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. పవిత్రోత్సవాల సమయంలో క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు.

'ఎన్‌సీఎల్ భూసేకరణ సర్వేను నిలిపివేయాలి'

మఠంపల్లి, సెప్టెంబరు 25 : మండలంలోని నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ రైల్వేట్రాక్ కోసం చేపట్టిన భూసేకరణ సర్వేను వెంటనే నిలిపివేయాలని రామచంద్రాపురం, భోజ్యాతండా, భీమ్లాతండా రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ మంగా రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు ఇస్లావత్ బాలాజీనాయక్ మాట్లాడుతూ పరిశ్రమ యజమాన్యం తండా రైతులతో సంప్రదింపులు జరపకుండా ఇష్టానుసారంగా రైల్వేట్రాక్ కోసం భూసేకరణ చేయడం సరికాదన్నారు. రైల్వేట్రాక్ సర్వేనంబర్ 540గుండా పోతుందని, ప్రసుత్తం ఈ సర్వే నంబర్ రాష్ట్ర స్థాయిలో వివా దం నెలకొని ఉందని, ఎన్‌సీఎల్ యజమాన్యం ఏఆధారంతో సర్వే చేయిస్తుందో అర్థం కావడంలేదన్నారు. ఇదే సర్వే నెంబరులో కొంతమంది కబ్జాలో ఉండగా మరికొందరు రైతులు పట్టా కలిగి ఉన్నారన్నారు. వివాదంలోని భూములకు నష్టపరిహారం నిర్ణయించకుండా భూసేకరణ సర్వేను అడ్డుకోవాలని ఆర్డీవోకు కలుస్తామన్నారు. కార్యక్రమంలో మిట్యానాయక్, కృష్ణనాయక్, సైదులు, అంజయ్య, చిన్న, సీతారాం, నాగేశ్వరావు రైతులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక సందర్శనీయ క్షేత్రం ఉండ్రుగొండ



ఉండ్రుగొండ గిరిదుర్గం పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చివ్వేంల, సెప్టెంబరు 25 : చారిత్రాత్మక సందర్శనీయ క్షేత్రం ఉండ్రుగొండగిరిదుర్గమని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం మండలంలోని ఉండ్రుగొండలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానాన్ని పరిశీలించి, మాట్లాడారు. పురాతన ప్రాంతంగా గుర్తింపు పొందిన గిరిదుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. చాలామంది రాజులు ఉండ్రుకొండను కేంద్రంగా చేసుకుని పాలన చేసిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతం నిజాం సుల్తాన్‌కాలంలో ధ్వంసమై శిథిల చరిత్రగా మిగిలిపోయిందన్నారు. కోట చుట్టూ ఎనిమిది గుట్టలు, వాటిని కలుపుతూ ఎత్తయిన ప్రాకారాలు, భారీ నిర్మాణాలు, 16 కిలోమీటర్ల మేర మట్టిగోడలు, 20 అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో నిర్మాణాలు చేపట్టారన్నారు. రాజులు, సామంతులు, పరిపాలన నాయకులు నివసించే చోటు కావడంతో దుర్భేద్యమైన ప్రాకారాలను రాళ్లతో నిర్మించారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వేణుమాధవ్, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, డీపీఆర్‌వో రమేష్‌కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, డాక్టర్ ఆదూర్తి రామయ్య, కార్యదర్శి రవిచంద్ర, ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, కృష్ణమోహన్, శ్రీరాములు, మురళీకృష్ణ, జుట్టుకొండ సత్యనారాయణ, నాగవల్లి బ్రహ్మయ్య, భరద్వాజ, సంతోష్, సైదులు, హర్ష సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో అలసత్వం వహిస్తే చర్యలు



వైద్యపరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో అప్పారావు

మోతె, సెప్టెంబరు 25 : ఓటరు జాబితా తయారీలో గ్రామ కార్యదర్శులు అలసత్వం వహిస్తే చర్యలు చేపడతామని జడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శులు ఓటరు జాబితా తయారీలో నిబంధనలను పాటించాలన్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో ఉండేలా జాబితా తయారు చేసుకోవాలన్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు చేపడతామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మామిళ్లగూడెంలో పారిశుధ్య కార్మికులకు కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. పారిశుధ్య కార్మికులను జిల్లా అధికారులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల రుజువులో దర్యాప్తు కీలకం



పోలీస్‌మీట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 25 : కోర్టుల్లో కేసులు నెగ్గి నేరస్తులకు శిక్షలు పడాలంటే కేసుకు సంబంధించి ఆధారాలు,నేర దర్యాప్తు కీలకమని అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జిల్లాపోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ మీట్‌లో ఆయన మాట్లాడారు.దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానన్ని వినియోగంపై మెలకువళలు నేర్చుకునేందుకు పోలీస్ డ్యూటీమీట్ ఎంతో దోహదపడుతుందన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని జోనల్‌స్థాయిలో డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. అంతకుముందు 50మంది పోలీస్ అధికారులకు కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్ హ్యాండ్లింగ్, లిఫ్టింగ్, ప్యాకింగ్ విభాగాల్లో, బ్యాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, వీడియోఅనాలసీస్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, నారాయణరాజు, నర్సింహ పాల్గొన్నారు.

వర్షాలతో అలుగుపోస్తున్న చెరువులు



గరిడేపల్లి మండలం అప్పిరెడ్డిగూడెం - సుభాష్‌నగర్ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

సూర్యాపేటటౌన్/గరిడేపల్లి, సెప్టెంబరు 25: జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి కురుస్తు న్న వర్షాలతో పలు మండలాల్లో చెరువులు అలుగులు పోస్తున్నాయి. ముఖ్యంగా గరిడేప ల్లి మండలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అప్పిరెడ్డిగూడెం, సుభాష్‌నగర్ మధ్య రాకపోకలు తీవ్రఇబ్బంది ఏర్పడింది. జిల్లా కేంద్రంలో కురిసిన వర్షంతో వరద నీరు రోడ్లపైకి చేరాయి. జిల్లాలో బుధవారం వర్షం కురిసింది. అత్యధికంగా నడిగూడెంలో 88.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కోదాడలో 3.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అనంతగిరిలో 45. 4,మద్దిరాలలో 43.9, నూతనకల్‌లో 43.7, పాలకీడులో 36.5, మునగాల 36.4, మోతెలో 33.9,గరిడేపల్లిలో 32.9, హుజూర్‌నగర్‌లో 29.7తో పాటు పలుచోట్ల వర్షపాతం మోస్తరుకు మించి వర్షం కురిసింది.

పోటీ పరీక్షలతోనే పరిజ్ఞానంపై అవగాహన

నల్లగొండ, శాలిగౌరారం, సెప్టెంబరు 25: పోటీ పరీక్షలతోనే విద్యార్థులకు పరిజ్ఞానంపై అవగాహన కలుగుతుందని నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం దోమలపల్లి హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. పరీక్షలతో విద్యార్థులకు లాజికల్‌థింకింగ్, మెంటల్ ఎబిలిటీ, సైన్స్, సాంఘిక శాస్త్రాల్లో అవగాహన పెరగడంతో పాటు విద్యార్థుల్లో పోటీ తత్వం కూడా అలవడుతుందన్నారు. ఎన్ఎంఎంఎస్‌లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శిక్షణ అందించి ప్రభుత్వ పాఠశాలల బతోపేతానికి కృషి చేయాలన్నారు. డీఎస్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. ఉన్నతస్థాయిలో ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రగతిని సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్యాచ్ స్కూల్ కిట్స్ డిస్ట్రిబ్యూషన్ డ్రైవ్‌లో భాగంగా పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్స్ అందించారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి, మినిస్టీరియల్ జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు, లక్ష్మారెడ్డి, జీహెచ్ఎం కొమ్ము శ్రీనివాసులు పాల్గొన్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్‌స్కూల్‌లో పల్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యులు పల్‌రెడ్డి రాంరెడ్డి విద్యార్థులకు సమకూర్చిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను జడ్పీసీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మెటీరియల్ దాత పల్‌రెడ్డి రాంరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కె.సంధ్యారాణి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 25: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారలను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారలను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండీజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 8,71,022 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి

హాలియా, సెప్టెంబరు 25: పరిశుభ్రతపై విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని పర్యావరణ ఇంజనీర్ రవి అన్నారు. స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా హాలియాలోని జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరు చేసే విషయాలపై అవగాహన కల్పించారు. హాలియాను స్వచ్ఛ హాలియాగా మార్చే విషయంలో విద్యార్థులు, యువత తమ పాత్రను పోషించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భవాని, స్కూల్ స్టాఫ్, మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్ సైదులు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం 589.10 అడుగులు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 25: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రం 589.10 అడుగులుగా ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 49,234 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 589.10 అడుగులుగా(309.3558టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5018 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,582 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 46,120 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా, ఎగువనుంచి 49,234 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా వస్తుంది. ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నాలుగు రోజులుగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఇప్పటికే ప్రాజెక్టు 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉండటం, మరిన్ని రోజుల పాటు వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టు 2, 3, 7 నెంబర్ క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి ఎగువనుంచి వస్తున్న వరద నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 3390.14 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా మూడు క్రస్టుగేట్ల ద్వారా 2744.77 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 435.78 క్యూసెక్కులు మొత్తం 3240.77 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగుల(4.46టీఎంసీ) నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.95 అడుగులుగా (4.179టీఎంసీ) ఉంది. రెండో విడతగా కుడి కాల్వకు 169.47 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 265.31 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

'పులిచింతల'కు నిలకడగా వరద ప్రవాహం

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నిలకడగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు వారం రోజులుగా ప్రాజెక్టు ఒక గేటు ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 174.86 అడుగులుగా(45.56 టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 33,460 క్యూసెక్కులు వరద ప్రవాహం కొనసాగుతుండగా ఒక గేటును 2.5 మీటర్ల ఎత్తు లేపి 20,950 క్యూసెక్కుల నీటిని, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 108 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు నుంచి అవుట్‌ఫ్లో 36,950 క్యూసెక్కులుగా నమోదైంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మఠంపల్లి, సెప్టెంబరు 25: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఓ ఇంట్లో గుర్తుతెలి యని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోదుగు జాన్‌రెడ్డి ఉదయం ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చిన వారు బీరువాను పరిశీలించగా రూ.10 వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు, రెండు జతల దిద్దులు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జాన్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి

కోదాడ, సెప్టెంబరు 25: సూర్యాపేట జిల్లా కోదాడ పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. కోదాడ పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని అనంతగిరి రోడ్డు నివాసముంటున్న సతీష్, భార్య అపర్ణ, బావమర్ది భద్రయ్య, మరికొందరితో కలిసి చేపల కోసం కోదాడ పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో సతీష్ చేపల గాలం విద్యుత్ పోల్‌కు తగిలించి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన భార్య, బావమర్ది వెంటనే నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సాయంత్రం సతీష్ మృతిచెందాడు సతీష్ భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోటారుకు మరమ్మతులు చేస్తుండగా..

వలిగొండ, సెప్టెంబరు 25: ఇంటి వద్ద మోటారు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెల్వర్తి గ్రామంలో బుధవారం గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల రవి తన ఇంటి వద్ద మోటారు రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఛాతీ మీద గాయాలు కాగా చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు

వివాహిత ఆత్మహత్యాయత్నం

వలిగొండ, సెప్టెంబరు 25:ఫినాయిల్ తాగి వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఎదుల్లగూడెం గ్రామానికి చెందిన బర్మ ఆఖిల(22) ఇంట్లో ఉపయోగించే ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం సిబ్బంది భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

పాత బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 25: యాదగిరిగుట్ట పాత బస్టాండ్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. బస్టాండ్‌లోని ఓ బెంచీపై పడుకొని ఉండడాన్ని గమనించి కంట్రో లర్ గొల్లూరి ఇస్తారి సుమారు మధ్యాహ్నం నిద్ర లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తిం చాడు. మృతుడు చామనఛాయ రంగులో ఉండి శరీరంపై ఆకుపచ్చ రంగు షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ఉంది. కంట్రోలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మనస్తాపంతో మిర్చిబండి వ్యాపారి ఆత్మహత్య

భువనగిరి టౌన్, సెప్టెంబరు 25: మనస్తాపంతో మిర్చిబండి వ్యాపారి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లాలో బుధవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి అర్బన్ కాలనీకి చెందిన నిడిగొండ శివప్రసాద్(42) ఉదయం చేనేత కార్మికుడిగా పనులు చేసి సాయంత్రం పట్టణ ప్రధాన రహదారిపై మిర్చి బండి నిర్వహించేవాడు. అయితే కొద్ది రోజులు క్రితం శివప్రసాద్ మధ్యవర్తిగా ఉండి తెలిసిన వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి కొందరికి డబ్బులు అప్పుగా ఇప్పించాడు. సదరు వ్యక్తులు వడ్డీ, అసలు చెల్లించకపోతుండడంతో వడ్డీ వ్యాపారి శివప్రసాద్‌పై ఒత్తిడి తెచ్చారు. దీంతో శివప్రసాద్ మనస్తాపంతో స్థానిక ఆర్‌బీనగర్‌లో మిర్చి బండి నిర్వహణకు అద్దెకు తీసుకున్న ఓ గదిలో మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం ఉదయం ఫ్యాన్‌కు వేలాడుతుండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ కుమారస్వామి సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. శివప్రసాద్‌కు కుమారుడు, కూతురు భార్య, ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

11 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 25 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఐ	ప్రస్తుతం	బదిలీ
వి.మహేశ్వర్	నల్లగొండ(డీఎస్‌బీ)	సూర్యాపేట(డీఎస్బీ)
వెంకటేశ్వర్లు	నల్లగొండ(వీఆర్)	సూర్యాపేట(డీఎస్బీ)
ఎస్‌కె.సైదులు	నల్లగొండ(డీసీఆర్‌బీ)	కోదాడటౌన్
కె.కృష్ణయ్య	మిర్యాలగూడటూటౌన్	మాడ్గులపల్లి
జి.శోభన్‌బాబు	మాడ్గులపల్లి	నల్లగొండ(వీఆర్)
డి.వెంకటేశ్వర్లు	సూర్యాపేట(డీసీఆర్‌బీ)	వేములపల్లి
డి.విజయ్‌కుమార్	వేములపల్లి	నల్లగొండ(వీఆర్)
పి.లోకేష్‌కుమార్	సూర్యాపేటటౌన్	మిర్యాలగూడరూరల్-1
సందీప్‌రెడ్డి	నల్లగొండ వన్‌టౌన్	మిర్యాలగూడరూరల్-2
వి.శేఖర్‌ను	మిర్యాలగూడ వన్‌టౌన్	అడవిదేవులపల్లి
బి.సాయిప్రశాంత్	సూర్యాపేట(సీసీఎస్)	తిప్పర్తి

గ్రామాల్లో ఇన్‌చార్జిల పంచాయితీ

- సెలవులపై వెళ్లిన కొన్ని గ్రామ కార్యదర్శులు
- రోజులు గడుస్తున్నా విధుల్లో చేరకపోవడంతో అధికారుల నోటీసులు
- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు



సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 24: గ్రామ పంచాయతీల్లో సర్పం చుల పాలన పూర్తికావడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో మొత్తం 46 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాలా గ్రామపంచాయతీల్లో కార్యదర్శులకు విధులు నిర్వహించడం కష్టతరంగా మారింది. పారిశుధ్యం, మంచినీటి సరఫరా తదితర సమస్యలను కార్యదర్శులు తమ గ్రామాల్లో పనులు చేపడుతున్నా సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితులు లేవని ప్రజలు పేర్కొంటున్నారు. వెంకటాద్రిపాలెం, జంకుతండా, బోట్యా నాయక్‌తండా, జప్తివీరప్పగూడెం, వాటర్‌ట్యాంక్‌తండాలకు చెందిన కార్యదర్శులు సెలవులు పెట్టినా గ్రామాల్లో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఉన్నతాధికారులు వాటిని మంజూరు చేయలేదు. ఇతర గ్రామాల కార్యదర్శులకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏ గ్రామపంచాయతీల్లో సమస్యలు పరిష్కరించుకోవాలో అర్థం కాని దుస్థితి. సెలవు పెట్టుకున్న ఆయా గ్రామాల కార్యదర్శులకు విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఐదు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు పంపారు. గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో కార్యదర్శులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామపంచాయతీల్లో సీజనల్ వ్యాధులు విస్తృతమవుతున్న సందర్భంలో శానిటేషన్, వాటర్ సప్లయ్ పైపులైన్లు తదితర సమస్యల పరిష్కారానికి సమయం సరిపోవడం లేదని తెలుపుతున్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు లేమి కారణంగా గ్రామాల అభివృద్ధి కష్టతరమవుతున్న సందర్భంలో పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులతోపాటు అప్పులు చేసి ఖర్చు చేస్తున్నారు. సెలవులపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన గ్రామపంచాయతీలను ఇన్‌చార్జిలుగా అప్పగించిన వాటిలో కూడా సొంత డబ్బులు ఖర్చు చేసి అభివృద్ధి చేయాలని ఒత్తిడి చేస్తున్నారని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామ పంచాయతీలకే తమ సొంత డబ్బులను ఖర్చు చేయలేక సతమతమవుతున్నసందర్భంలో ఇన్‌చార్జిగా ఉన్న గ్రామపంచాయతీలకు సైతం డబ్బులు ఖర్చు చేయాలని ఆదేశాలు వస్తుండడంతో ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించడం భారంగా మారిందని పేర్కొంటున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలు మరో 3,4 నెలలు పడుతుందని అప్పటివరకు ఎలాంటి బిల్లులు అందకుండా గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించడం ఆర్థిక భారంగా మారనుందని పలువురు పేర్కొంటున్నారు.

కార్యదర్శులు విధుల్లో చేరాలి

సెలవులపై వెళ్లిన కార్యదర్శు లు విధుల్లో చేరి తక్షణమే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం గ్రామాల్లో ప్రజా పాలన సవ్యంగా సాగే విధం గా తగిన చర్యలు చేపట్టాలి. సీజనల్ వ్యాధుల బారి న పడకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను వారికి అందేలా చర్యలు తీసుకోవాలి.

\- శేషగిరిశర్మ, ఎంపీడీవో.

సస్పెండ్ చేసిన పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలి

నల్లగొండ జిల్లాలో అకారణంగా సస్పెండ్ చేసిన పంచాయతీ కార్యదర్శులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అధికారుల ఒత్తిళ్ల నుంచి తమను రక్షించాలని కోరుతూ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు డివిజన్ పంచాయతీ కార్యదర్శులు మిర్యాలగూడలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాలకు నిధుల కొరత ఏర్పడడంతో తాము అప్పులు తీసుకొచ్చి మరీ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను, పారిశుధ్య పనులను చేపడుతూ ప్రజల ఇబ్బందులు తొలగిస్తున్నామని అన్నారు. పంచాయతీరాజ్ చట్టంలో లేనప్పటికీ గ్రామపంచాయతీల్లో పనులను చేపట్టేందుకు సొంత డబ్బులను వెచ్చించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారని, అలా చేయకపోతే గ్రామాల్లో పనులు చేపట్టడం లేదని ఆరోపిస్తూ తమను బెదిరిస్తున్నారని, సస్పెండ్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. చట్టంలో లేకపోయినా పేద కుటుంబాలకు చెందిన తాము లక్షల రూపాయలను ఎక్కడి నుంచి అప్పులు తీసుకొచ్చి పెట్టాలని ప్రశ్నిస్తున్నారు. తమ సొంత డబ్బులతో గ్రామ పంచాయతీలకు ఖర్చు పెట్టలేమని, ఇప్పటివరకు తాము గ్రామపంచాయతీలకు ఖర్చు చేసిన బిల్లులు రావడం లేదంటున్నారు. అకారణంగా సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉన్నతాధికారుల ఒత్తిళ్ల నుంచి రక్షించాలని కోరారు. సమస్యలను పరిష్కరించేంతవరకు తమకు సామూహిక సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కోడిరెక్క శైలజ, నరేష్, రామకృష్ణ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

- శాలిగౌరారం మండలంలో నీట మునిగిన పొలాలు
- దేవరకొండ మండలం తాటికోలు గ్రామంలో కూలిన ఇల్లు



శాలిగౌరారం నుంచి ఉట్కూర్ వెళ్లే రోడ్డులో ప్రవహిస్తున్న వరద నీరు

శాలిగౌరారం, సెప్టెంబరు 25: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం పలు చోట్ల వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. శాలిగౌరారం నుంచి మాదారం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉట్కూర్ సమీపంలోని కాజ్‌వేలో నీరు రోడ్డు దాటకుండా ఉధృ తంగా ప్రవహిస్తోంది. దాంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పలు రోడ్లు దెబ్బతిన్నాయి. శాలిగౌరారం, లింగోటం, తిరుమలరాయినిగూడెం, ఉట్కూరు, అడ్లూర్ గ్రామాల్లో వరి, పత్తి చేలు వరద నీటిలో మునిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇసుక మేట వేశాయి. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తాటికోలు గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి ఇల్లు కురుస్తున్న వర్షాలకు కూలిపోయి ంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నిరుపేద కుటుంబానికి చెందిన దస్తగిరి కూలి పని చేస్తు జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా కూలిన దస్తగిరి ఇంటిని బుధవారం పంచాయతీ కార్యదర్శి మూర్తి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్‌కు నివేదిక అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



తాటికోలులో కూలిన ఇల్లు

గరిడేపల్లి: బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని అబ్బిరెడ్డిగూడెం, సుభాష్‌నగర్ గ్రామాల మధ్య గల తాళ్లవాగు ఉధృతంగా ప్రవహించి రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు, వ్యవసాయ దారులు, పట్టణానికి వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. అనంతరం సాయంత్రానికి ఉధృతి తగ్గిన తర్వాత గ్రామాల మధ్య రాకపోకలు కొనసా గాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లోలెవల్ వంతెనను తొలగించి పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



శాలిగౌరారం బస్ స్టేజీ వద్ద ఇసుక మేట వేసిన వరి పొలం

రామన్నపేట: వర్షం కురిస్తే స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణ మడుగును తలపిస్తుంది. వర్షపు వరద నీరు వెళ్లడానికి కాల్వ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నీరు మడుగును తలపిస్తోంది. ఆ నీటిలో దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల గృహాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరద నీరు పోవడానికి కాల్వలు ఏర్పాటు చేయమని అధికారులకు కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతున్న ఇలాంటి తరుణంలో తమకు వ్యాధులు సోకుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మడుగును తలపిస్తున్న రామన్నపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణ

సాగర్ ఎడమ కాల్వలో ఇద్దరు గల్లంతు

- దుస్తులు ఉతికేందుకు వెళ్లిన ముగ్గురు
- ఒకరిని కాపాడిన స్థానికులు
- బొక్కమంతలపహాడ్ వద్ద ఘటన

నిడమనూరు, సెప్టెంబరు 25: దుస్తులు ఉతికేందుకు వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాత్తు నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో జారి పడి గల్లంతయ్యారు. వారిలో ఒకరిని స్థానికులు రక్షించగా, మరో ఇద్దరు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. బుధవారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ వద్ద ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురారం మండల కేంద్రానికి చెందిన వేమారపు సాయి(25) స్థానికంగా కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మేదరి శైలజ(24), అవిరెండ్ల రమాదేవి(23) అతని కూరగాయల దుకాణంలో పని చేస్తున్నారు. సాయి కుటుంబానికి చెందిన ఒకరు స్వామి మాల వేస్తున్నందున ఇంట్లో ఉన్న దుస్తులు శుభ్రం చేసేందుకు సాగర్ కాల్వకు వెళ్లాలనుకున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న దుస్తులు మొత్తం ఉతికేందుకు టాటాఏస్ వాహనం తీసుకొని సాయితో పాటు రమాదేవి, శైలజ కూడా నిడమనూరు మండల పరిధిలో బొక్కమంతలపహాడ్ వద్ద ఉన్న సాగర్ కాల్వకు బుధవారం సాయంత్రం వెళ్లారు. కాల్వలో దుస్తులు ఉతికి పైకి వస్తున్న క్రమంలో శైలజ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి కేకలు వేస్తుండగా ఆమెను రక్షించే ప్రయత్నంలో సాయి కూడా కాల్వలోకి దూకాడు. ఇద్దరు కేకలు వస్తుండగా భయంతో రమాదేవి కూడా కాల్వలో దూకింది. ముగ్గురికీ ఈత రాకపోవడంతో కేకలు వేస్తూ నీటిలో కొట్టుకుపోతున్నారు. కాల్వలో కేకలు వినిపించడంతో బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన దర్మారపు సైదులు, దర్మారపు జానయ్య వెంటనే చీర సహాయంతో రమాదేవిని పైకి లాగి ఒడ్డుకు చేర్చారు. సాయి, శైలజను కాపాడలేకపోవడంతో ఇద్దరు నీటిలో గల్లంతయ్యారు. కాల్వలో ఇద్దరు గల్లంతైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రమాదేవిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని ఎస్‌ఐ గోపాలరావు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో త్రిపురారంలో విషాదం నెలకొంది.




సాయి(ఫైల్), శైలజ (ఫైల్)

నెస్ట్స్ సభ్యుడిగా డాక్టర్ శరత్

మిర్యాలగూడఅర్బన్, సెప్టెంబరు 25: నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబుల్ స్టూడెంట్స్ (నెస్ట్స్) సభ్యుడిగా గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్ ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శరత్ నియామకం పట్ల బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లోని గిరిజన జనాభాలో అక్షరాస్యత పెంపొందించేందుకు శరత్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన వెంట గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు సూర్యానాయక్, మాన్యనాయక్, శ్యామ్‌నాయక్ ఉన్నారు.

కారు డివైడర్‌ను ఢీకొని ముగ్గురికి గాయాలు

మోతె, సెప్టెంబరు 25: డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రలోని సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన ఇమ్రాన్, ఖరీముల్లా, ముస్తఫా, సాయితేజ కారులో హైదరాబాద్‌లో పనుల నిమిత్తం వెళ్లి తిరిగి ఖమ్మం వెళ్తున్నారు. ఈ క్రమంలో మోతె గ్రామశివారులో ఉన్న ఫ్లై ఓవర్ మీద అతివేగంతో కారు వస్తున్న రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇమ్రాన్, సాయితేజ తలకు గాయాలయ్యాయి. ఖరీముల్లా, ముస్తాఫాలకు స్వల్ప గాయాల య్యాయి. నేషనల్ హైవే 1033 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిర్వహించి ఖమ్మం తరలించారు.

ఇసుక మాయాజాలం

- మోతె మండలంలో ఇసుకకు గిరాకీ
- నిల్వ ఉంచిన ఇసుక భారీ ధరకు విక్రయం
- ట్రాక్టర్ లోడు రూ.10వేలు పలుకుతున్న వైనం
- అధికారులు సీజ్ చేసిన డంపులూ మాయం



మోతె మండలంలోని నర్సింహాపురం గ్రామంలో డంపు చేసిన ఇసుక

మోతె, సెప్టెంబరు 25: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని పలు గ్రామాల్లో భారీగా ఇసుక డంపులు ఉన్నాయి. డంపు చేసిన వారు భారీ ధరకు ఇసుక విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ.10వేలు విక్రయిస్తున్నట్లు సమాచారం. మండలంలో ఇసుక కొరత సృష్టించడంతో సీసీరోడ్లు, ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడుతోంది. దీంతో నిర్మా ణాలు ఆగిపోతున్నాయి. గతంలో అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపులు కూడా మాయమవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మోతె మండల పరిధిలోని పాలేరు వాగుకు వెంట ఉన్న రైతుల పంటలు నీట మునిగి వరదల్లో వరి పంటచేలు కొట్టుకుపోవడంతో రైతులకు నష్టం జరిగింది. ఇసుక అక్రమంగా తరలించే వారికి పంట చేలల్లో చేరిన ఇసుక కాసులు కురిపిస్తోంది. దీనికితోడు వరదలు రావడంతో ఇసుక దొరకకపోవడంతో డంపు చేసినవారు ట్రాక్టర్ లోడు రూ.10వేలకు విక్ర యిస్తున్నారు. ఇసుక డంపులు నిల్వచేసిన వారిపై చర్యలు చేపట్టకుండా ఉండేందుకు లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో డంపులు చేసిన వారు రాత్రి, పగలు అనే తేడాలేకుండా ఇసుక తరలిస్తున్నారు. వర్షాలు, వరదలు తగ్గడంతో పాలేరు వాగు వెంట ఉన్న రైతుల పొలాల్లోకి చేరిన ఇసుక మేటలను తరలించేందుకు నర్సింహాపురం, ఉర్లుగొండ గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులు పొలంలో ఉన్న ఇసుక మేటలను తీసుకెళ్తాం 'నీకు ఎంత ఇవ్వాలి' అని రైతుల చుట్టూ తిరుగుతున్నారు. డంపులు సీజ్‌చేసిన వాటిని తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాలకు చెందినవారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇతర జిల్లాలకు తరలుతున్న ఇసుక

రాత్రి, పగలు తేడా లేకుండా డంపులు చేసిన ఇసుకను మోతె మండలంతో పాటు కోదాడ, ఖమ్మం, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం గ్రామాలకు తరలిస్తున్నారు. నర్సింహాపురం గ్రామానికి చెందిన ఇసుక వ్యాపారులు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నా నాయకుల ఒత్తిడితో చర్యలు చేపట్టడడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇసుక లోడులతో ట్రాక్టర్ల వెళ్తుండడంతో నర్సింహాపురం-ఉర్లుగొండ బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోయి పెద్ద, పెద్ద గోతులు ఏర్పడాయి. అయినా ఇసుక వ్యాపారులు గోతుల్లో నుంచే తరలిస్తున్నారు. ఈ గ్రామాలకు చెందిన నాయకులు ఇసుక డంపులు చేసిన వారికి అధికారులు, నాయకుల మద్దతు ఉండడంతో చెప్పిన ధరకు విక్రయిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు, సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టే వారికి ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు నిలిచి పోతున్నాయి. ఇదే అదునుగా ఇసుక ధరలు రూ.10 వేలకు పైబడే పెంచారు. వేసవిలో పాలేరు వాగు నుంచి ఇసుకను తరలించి డంపు చేసిన నిల్వలను అధికార పార్టీ నాయకుల ఫిర్యాదులతో నర్సింహాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు.

మాయమవుతున్న సీజ్ చేసిన ఇసుక డంపులు

మండలంలోని నర్సింహాపురం, తుమ్మగూడెం, నేరేడువాయి, రంగాపురం తండా, రాయికుంటతండా, ఉర్లుగొండ గ్రామాల్లో వందల సంఖ్యలో 200 టిప్పుల ట్రాక్టర్ లోడులు పైబడే సుమారు 100 వరకు అన్ని గ్రామాల్లో డంపులు ఉన్నాయి. వాటిని అధికారులు చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

సీజ్‌చేసిన ఇసుక డంపులు తరలిస్తే చర్యలు



గతంలో నర్సింహాపురం, ఉర్లుగొండ, తుమ్మగూడెం గ్రామాల్లో ఇసుకను అక్రమంగా డంపులు చేసిన వారి వివరాలు సేకరించి వారికి సీజ్‌చేసిన ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు, రెవిన్యూ అధికారులు పంచనామ నిర్వహించి వారికి తెలియజేయడం జరిగింది. ఇసుక డంపులు నిల్వచేసిన గ్రామాల్లో రెవిన్యూ అధికారులు పరిశీలన చేపట్టి నిల్వలను సీజ్‌చేయడం జరుగుతుంది.

● సంఘమిత్ర, మోతె తహసీల్దార్.

ఇసుక డంపులను స్వాధీనం చేసుకోవాలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వ్యాపారులు అక్రమంగా నిల్వల చేసిన వందలాది ఇసుక డంపులను స్వాధీనం చేసుకోవాలని. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించాలి. సామాన్యులు ఇసుక కొనుగోలు చేయాలంటే భయపడుతున్నారు. ఇసుక అక్రమంగా నిల్వ చేసిన వారికి నాయకులు కొమ్ముకాయడం మానుకోవాలి. ఈ పది గ్రామాల్లో నిల్వలు ఉన్న వాటిని గుర్తించి ఇక్కడి నుంచి తరలించాలి.

● సైదులు సామాజిక కార్యకర్త మోతె మండలం

పార్కింగ్ స్థలంగా క్రీడాప్రాంగణం

● మొక్కలు లేని పల్లెప్రకృతి వనం ● ఎస్సారెస్పీ కాలువ కట్టపై ఆక్రమణలు ● చోద్యం చూస్తున్న అధికారులు

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 25: మండలంలోని కోటినాయక్‌తండా శివారులో సూర్యాపేట - దంతాలపల్లి ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఆ ప్రాంతంలో బోర్లు వేసే వాహనాలు దర్శనమిస్తున్నాయి. క్రీడాప్రాంగణ స్థలాన్ని అధికారులు పట్టించుకోనందున నిరుపయోగంగా మారింది. ఈ ప్రాంగణం చుట్టూ మొక్కలు నాటడంతో పాటు, ప్రాంగణంలో వ్యాయామం చేసుకోవడానికి పరికరాలు, ఆటలు ఆడటానికి కోర్టులు ఏర్పాటు చేయాలి. అయితే ఎవరూ ఈ ప్రాంగణాన్ని పట్టించుకోవడంలేదు. ఈ ప్రాంతం పార్కింగ్ స్థలంగా మారినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అదేవిధంగా ఆత్మకూర్(ఎస్)మండలంలో ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల్లో పచ్చదనం కనిపిస్తుండగా, కోటినాయక్‌తండాలో మొక్కలు కనిపించడంలేదు. కోటినాయక్‌తండాఈలో ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ డీబీఎం 70కి చెందిన కాల్వ భూమిని పల్లె ప్రకృతి వనం కోసం అప్పటి అధికారులు కేటాయించారు. ఆ వనంలో ఏడాది క్రితం మొక్కలు నాటినా అవి ఎండిపోయాయి. ఇప్పటి వరకు పల్లెప్రకృతి వనాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. దీనికి ఎదురుగా ఉన్న కాల్వ కట్ట భూమిలో ఏకంగా పెద్ద హోటల్‌ను నిర్మించారు. మరో వైపు ఓ మాజీ ప్రజా ప్రతినిధి కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. కాల్వ భూమిని ఎలా ఆక్రమిస్తారని అధికారులు అడిగితే, పల్లె ప్రకృతి వనంలో బోర్ వాహనాలు పార్క్ చేయగా, తాము హోటల్, కూరగాయల షెడ్లు ఏర్పాటు చేసుకుంటే తప్పేంటని కబ్జా దారులు దబాయిస్తున్నట్లు తెలిసింది. ఈ రెండు వైపులా భూములు ఆక్రమించిన వారికి అప్పట్లో బీఆర్ఎస్ నాయ కులు, ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం. హోటల్ యజమానికి పంచాయతీ కార్యదర్శి సహకరిస్తున్నట్లు సమాచారం. కాలువ కట్టలను కొందరు ఆక్రమించి, ప్లాట్లుగా చేసుకొని హద్దు రాళ్లు పాతుకుంటున్నారు. ప్రధాన రహదారి కావడంతో బడా నేతల సహకారంతో ఆక్రమణలకు గురవుతు న్నట్లు తెలిసింది. ఆక్రమణదారులకు సంబంధిత అధికారులు నోటీసులు ఇచ్చినా కొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి కాలువ భూములను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



క్రీడా ప్రాంగణంలో పార్క్ చేసిన బోరు బండ్లు

స్థలం అవసరమైతే ఖాళీ చేయిస్తాం

కాలువ కట్ట ఖాళీగా ఉందని కొందరు ఆక్రమించుకున్నారు. ఏదో బతుకు తెరువు కోసం నిర్మాణాలు చేసుకున్నారు. ప్రభుత్వానికి స్థలం అవసరమైనప్పుడు ఆక్రమణదారులను ఖాళీ చేయిస్తాం.

నగేష్, డీఈ, ఐబీ

ఎంఈవోలుగా బాధ్యతల స్వీకరణ

నేరేడుచర్ల, చిలుకూరు, నాగారం, మద్దిరాల, అనంతగిరి, మఠంపల్లి, సెప్టెంబరు 25: వివిధ మండలాలకు ఎంఈవోలుగా పలువురు బుధవారం బాధ్య తలు స్వీకరించారు. నేరేడుచర్ల ఎంఈవోగా పుట్టారి సత్యనారాయణరెడ్డి, చిలుకూరు, ఎంఈవోగా మండలంలోని బేతవోలు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాగి గురవయ్య, నాగారం ఎంఈవోగా మండల నోడల్ అధికారి, ఈటూరు జడ్పీహెచ్‌ఎస్ గెజిటెడ్ హెచ్‌ఎంగా వాసం ప్రభాకర్, మద్దిరాల ఎంఈవోగా తండు వెంకటనారాయణగౌడ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతగిరి ఎంఈవోగా మండలంలోని గోండ్రియాల గెజిటెడ్ హెచ్‌ఎం తల్లాడ శ్రీనివాసరావు అదనపు బాధ్యతలు స్వీకరించారు. మఠంపల్లి ఎంఈవోగా మండలంలోని చౌటపల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కె.వెంకటాచారి అదనపు బాధ్యతలు స్కీరించారు.

పాఠశాలకు ఉపాధ్యాయుడి చేయూత

తిరుమలగిరి, సెప్టెంబరు 25: తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌కు ఉపాధ్యాయుడు చేయూతనందించారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ మరమ్మతుకు గురికాగా, ఆంగ్ల తన సొంత డబ్బు రూ.30వేలతో మరమ్మతు చేయించి బుధవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా అశోక్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దామెర శ్రీను, జానయ్య, తదితరులు పాల్గొన్నారు

'వ్యాపారంగా మారిన విద్యారంగం'

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 25: విద్యారంగం వ్యాపారంగా మారిందని ఎడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 30వ తేదీన జరిగే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాల సభ, అక్టోబరు ఒకటో తేదీన జరిగే ఆలిండియా ఆవిర్భావ సభ వాల్ పోస్టర్లను బుధవారం జిల్లా కేంద్రంలోని 60ఫీట్ల రోడ్డులో ఆవిష్కరించి మాట్లాడారు. పేదలకు ఉచిత, నాణ్యమైన, కామన్ విద్యావిధానాన్ని అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగాని లక్ష్మయ్య, పిడమర్తి లింగయ్య, విజయరాజు, వెంకటేష్, మహేష్, లోకేష్, రాజు పాల్గొన్నారు.

'జమిలి ఎన్నికలు దేశానికి ప్రమాదం'

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 25: జమిలి ఎన్నికలు దేశానికి ఎంతో ప్రమాదమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం అమరవరంలో నిర్వహించిన సీపీఎం మహాసభ సందర్భంగా జెండా ఎగురవేసి మాట్లాడారు. జమిలి పేరుతో రాష్ట్రాల హక్కులను హరించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. సెక్యులర్ పార్టీలు జమిలిని అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోసనబోయిన హుస్సేన్, మురళి, బ్రహ్మం, సైదా, బాలసైదులు, సీతారాములు, వీరస్వామి, అరవింద్ పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ అధికారిగా ఎంపిక

నూతన్‌కల్, సెప్టెంబరు 25: మండలంలోని దిర్శనపల్లి గ్రామానికి చెందిన గంట వెంకటేశం సాంఘిక సంక్షేమ అధికారిగా ఎంపికయ్యాడు. రాష్ట్రంలో ఎస్సీ కేటగిరిలో 4వ ర్యాంక్ సాధించాడు. యాదాద్రి జోన్‌లో 22వ ర్యాంక్ సాధించాడు.పేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వెంకటేశంను గ్రామస్థులు అభినందించారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ కోసం సంప్రదించాలి

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 25: లేఅవుట్ రెగ్యులరైజేషన్ కోసం 2020లో దరఖాస్తు చేస్తున్నవారు ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ కోసం మునిసిపల్ కార్యాలయంలో సంప్రదించాలని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటలో కోరారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ. 1000 చెల్లించిన వారు రసీదు, ప్లాట్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లు తీసుకుని మునిసిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలన్నారు. ప్లాట్‌ను ఎల్‌ఆర్‌ఎస్ లాగిన్‌లో జియో ట్యాగింగ్ చేయించి వచ్చే మెసేజ్ ద్వారా ఫీజు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసిడింగ్‌ను పొందాలన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమాలోచన సదస్సును విజయవంతం చేయాలి

భానుపురి, సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 25: మిషన్ ఎడ్యుకేషన్ తెలంగాణ పేరిట నల్గొండలోని ప్రభుత్వ లెక్చరర్ భవనంలో ఈనెల 29న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థ సమాలోచన సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాయి త్రివేణి డిగ్రీ, పీజీ కళాశాలలో కరపత్రం అవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెసర జనార్ధన్‌రెడ్డి, గోపినాథ్,ఉపేందర్, బెంజారపు రమేష్, దేవేందర్‌యాదవ్, అనిల్‌కుమార్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తొండ గ్రామానికి అధికారుల రాక

తిరుమలగిరి రూరల్. సెప్టెంబరు 25: మండలంలోని తొండ గ్రామాన్ని జాతీయ రహదారి అధికారులు బుధవారం పరిశీలించారు. బస్టాండ్ వద్ద అండర్ పాస్ వంతెన ఏర్పాటు చేయాలని తొండ గ్రామానికి చెందిన అభ్యుదయ కమిటీ సభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావును మంగళవారం కలిశారు. ఆయన ఫోన్ ద్వారా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తెలపగా స్పందించారు. కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు తొండ గ్రామాన్నిజాతీయ రహదారి అధారిటీ ఈఈ, డీఈ దర్శించారు.

డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలి



వంతెన పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల రూరల్, సెప్టెంబరు 25: మండలంలోని గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన ప్రాంతంలో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. వంతెను నిర్మాణ ప్రాంతాన్ని ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. వంతెన నిర్మాణ ప్రాంతంలో కాంట్రాక్టర్ తాత్కాలిక డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయకుండా వంతెనను నిర్మిస్తున్నందున రాకపోకలకు మూడు మండలాల ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వంతెన నిర్మాణంలో ఇసుకను వినియోగించకుండా డస్టును వాడుతున్నారన్నారు. వంతెన నాణ్యతను అధికారులు పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్, తాడ్వాయి సొసైటీ చైర్మన్ తొగరు సీతారాములు, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ఎల్పీ రామయ్య, మండల ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి వృద్ధుల సలహాలు దోహదం

సూర్యాపేట(కలెక్టరేట్) సెప్టెంబరు 25: సమాజాభివృద్ధికి వృద్ధుల సలహాలు, అనుభవాలు, సూచనలు ఎంతో దోహదపడుతాయని ఆ సంఘం జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో వారోత్సవాల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. అక్టోబరు ఒకటో తేదీ వరకు వృద్ధుల వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. 26న వృద్ధాశ్రమంలో వృద్ధులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్‌ర్యాలీ, 28, 29వ తేదీల్లో వృద్ధుల రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్‌డే, అక్టోబరు ఒకటో తేదీన జిల్లా స్థాయి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ముగింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, ఆర్రె రామకృష్ణారెడ్డి, విద్యాసాగర్, హమీద్‌ఖాన్, భాస్కరాచారి, సుధాకర్, వెంకట్‌రెడ్డి, హస్సెన్, వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జనసంఘ్ సిద్ధాంత కర్త దీన్‌దయాళ్

భానుపురి, సెప్టెంబరు 25: జనసంఘ్ సిద్ధాంత కర్త దీన్‌దయాళ్ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం సూర్యాపేటలోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, జుట్టుకొండ సత్యనారాయణ, సలిగంటి వీరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు గజ్జెల వెంకటరెడ్డి, చల్లమల్ల నర్సింహ సైదులు, సలిగంటి శ్రీనివాస్, రంగినేని లక్ష్మణ్ రావు,పేర్వాల లక్ష్మణ్‌రావు, రమేష్, మంగ్యానాయక్, సాలయ్య తదితరులు ఉన్నారు.

యర్రవరం పీఏసీఎస్ సీఈవోగా మౌలాలి

కోదాడ రూరల్, సెప్టెంబరు 25: మండలంలోని యర్రవరం పీఏసీఎస్ సీఈవోగా మౌలాలి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఈవోగా విధులు నిర్వహించిన హుస్సేన్‌ను జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు సస్పెండ్ చేయడంతో మౌలాలికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ పీఏసీఎస్‌లో కొన్నిరోజులుగా చైర్మన్, సీఈవో హుస్సేన్‌లు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. పోటాపోటీగా సమావేశాలూ నిర్వహించారు. సహకార సంఘంలో 66 మంది రైతులకు రూ.30 లక్షలకు పైగా రుణాలు మాఫీ కానందున జిల్లా సహకార అధికారి పద్మజకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె విచారణ చేసి బాధ్యుడైన సీఈవోను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

నాణ్యమైన బోధనకు ప్రిన్సిపాల్ కృషి: ఎంఈవో

పెన్‌పహాడ్, సెప్టెంబరు 25: నాణ్యమైన బోధనకు మండలంలోని అనాజీపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రమీల కృషి చేశారని ఎంఈవో నకిరేకంటి రవి అన్నారు. పెన్‌పహాడ్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. 11ఏళ్లుగా నిబద్ధతో ప్రమీల కృషి చేశారని, పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించడానికి కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆసియాబేగం, వస్త్రాంనాయక్, అన్నామేరీ, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

కోదాడటౌన్, సెప్టెంబరు 25: మునిసిపల్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కోదాడ మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల తెలిపారు. బుధవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. . ఈ సందర్భంగా కార్మికులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమాదేవి, వైద్యులు విజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 25: పట్టణాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మునిసిపల్ వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకోబ్‌పాషా కోరారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో 'స్వచ్ఛతా హీ' సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిద్దె తోటలు పరిశీలించారు. రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రజల భాగస్వామ్యంతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గౌడ్, గాయత్రిభాస్కర్, రంగారావు, అశోక్, ఆదిలక్ష్మి జయవాణి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

.నేరేడుచర్ల: 'స్వచ్ఛతా హీ' కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవహారాన్ని నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. తడి చెత్త, పొడి చెత్త అవశ్యకతను, పరిసరాల శుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు, మునిపినలః అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నేరేడుచర్ల, సెప్టెంబరు 25: సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ కోరారు. బుధవారం మునిసిపాలిటీలోని బస్తీ దావాఖానాను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారి సాయిరాంను అడిగారు. దవాఖానాలో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నామని, మందులు కూడా పీహెచ్‌సీ నుంచి సరఫరా కావడం లేదని చైర్మన్ దృష్టికి వైద్యాధికారి తీసుకు వచ్చారు. వెంటనే డీఎంహెచ్‌వో కోటాచలంతో ఫోన్‌లో మాట్లాడగా బస్తీ దావాఖానాకు సిబ్బందిని నియమించడంతో మందులు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. బోర్ నుంచి మునిసిపల్ వాటర్ ట్యాంకు నుంచి దావాఖాను నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని మునిసిపల్ చైర్మన్ ప్రకాష్ హామీ ఇచ్చారు.. ఆయన వెంట మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కొణతం చిన వెంకటరెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత ఉన్నారు.

మరణంలేని గాయకుడు ఎస్పీ బాలు



ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మనం వికాస వేదిక సభ్యులు

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 25: స్మరణమేగాని మరణంలేని గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 19భాషల్లో 50 వేల పాటలు పాడి మూడు తరాలకు ఎస్పీల బాలు గాత్రాన్ని అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మనం వికాస వేదిక అధ్యక్షుడు, సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్, సుధా బ్యాంక్ డైరెక్టర్లు కక్కిరేణి చంద్రశేఖర్, భోనగిరి భాస్కర్, పొనుగోటి నిర్మల, ఇరిగి కోటేశ్వరి, అంజన్‌ప్రసాద్, రమేష్, సోమయ్య, కృష్ణ, చారి పాల్గొన్నారు.

అండర్ పాస్ వద్దు.. బైపాస్ రోడ్డు వేయండి

తిరుమలగిరి, సెప్టెంబరు 25: తిరుమలగిరిలో అండర్ పాస్ వద్దు, బైపాస్ రోడ్డు నిర్మించాలని అఖిలపక్ష నాయకులు, వ్యాపారులు కోరారు. అండర్ పాస్ వంతెనకు వ్యతిరేకంగా నిరసన తెలిపి జాతీయ రహదారి అధికారులకు బుధవారం తిరుమలగిరిలో వినతిపత్రం అందజేశారు. అండర్ పాస్ వంతెనను నిర్మిస్తే తమ ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని వ్యాపారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, సామ ఆంజనేయులు, మూల రవీందర్‌రెడ్డి, కడెం లింగయ్య, కందుకూరి ప్రవీణ్ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

తిరుమలగిరిలో బస్ డిపో నిర్మించాలి

తిరుమలగిరిలో బస్ డిపో నిర్మించాలి బస్ డిపో సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం తిరుమలగిరిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డిపో నిర్మాణంపై ప్రజాపతినిధులు, అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో సాధన సమితి అధ్యక్షుడు కడెం లింగయ్య, ఎస్కే పాష, కొత్తగట్టు మలయ్య, కందుకూరి సోమన్న, ప్రవీణ్, సోమయ్య, బత్తుల శ్రీధర్, తన్నీరు రాంప్రభు, నలుగూరి రమేష్ పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు




వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 25: అహార పదార్థాలను కల్తీ చేసి విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, టాస్క్‌ఫోర్స్ అధికారి జ్యోతిర్మయి హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కిరాణాఫాన్సీ మర్చంట్ భవనంలో వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వ్యాపారం చేయాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన పదార్థాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి వ్యాపారి విధిగా ఫుడ్ లైసెన్స్ పొందాలని, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. నాణ్యతలేని, శుభ్రత పాటించని దుకాణాల యజమానులకు ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం షెడ్యూల్ 4కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఆర్. కిరణ్‌కుమార్, లతీఫ్, కిరాణ ఫాన్సీ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న రాంచంద్రారెడ్డి, గౌరవ అధక్షుడు వెంపటి రమేష్, జనరల్ సెక్రెటరీ పాలవరపు నర్సింహారావు, కోశాధికారి చల్లా విశ్వనాథ్ పాల్గొన్నారు.

డీమార్ట్‌లో ఆకస్మికంగా తనిఖీలు

జిల్లా కేంద్రంలోని డీమార్ట్ షాపింగ్‌మాల్‌లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, టాస్క్‌ఫోర్స్ అధికారి జ్యోతిర్మయి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కల్తీ జరిగి ఉంటుందను అనుమానంతో కుల్లాగా విక్రయిస్తున్న 20కేజీల టీ పౌడర్‌ను సీజ్ చేశార్ను టీ పొడి శాంపిల్స్‌ను తీసుకుని పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాల్లో హానికరమైన కెమికల్స్, రంగులు వాడొద్దని సూచించారు. డీమార్ట్ నిర్వాహకులకు ఫుడ్ సెఫ్టీ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేశారు.



సూర్యాపేట అర్బన్: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన మార్గదర్శకాలు సహేతుకంగా లేవని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యామ రమేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాసర్ల వెంకట్‌రెడ్డి, రవి కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): నేటి రాజకీయాల్లో కొనసాగుతున్న గుండాగిరి, దందా రాజకీయాలకు చరమగీతం పాడాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. బుధవారం మండలంలోని నెమ్మికల్‌లో జరిగిన పార్టీ మండల ప్లీనరీలో ఆయన మాట్లాడారు. ఈ. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, గట్ల రమాశంకర్ పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్) మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నశీంపేటకు చెందిన ములకలపల్లి నాగరాజు జ్ఞాపకార్థం తల్లిదండ్రులు అనసూయ, వెంకన్న దంపతులు 100మంది విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లలిత, సైదులుపాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి కల్యాణి కోరారు.పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో 'వయసుకు తగిన బరువు' అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నూర్జహాన్‌బేగం, రామకృష్ణ పాల్గొన్నారు.

● విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు కోరారు. హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెంలో రెండో రోజు నిర్వహించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అప్పయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

● విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రామారావు కోరారు. హుజూర్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, సునంద, మహేష్, బాలరాజు, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, స్వాతి పాల్గొన్నారు.

● బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీలతారెడ్డి కోరారు. హుజూర్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. . కార్యక్రమంలోరామరాజు, లత, వెంకటమ్మ, రమణ, లక్ష్మి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని 9వ వార్డు కౌన్సిలర్ బొల్లెద్దు ధనమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొట్టె శ్రీనివాస్, రాయల వెంకటేశ్వర్లు, మధు, బెంజిమెన్, రవి పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం కల్లూరు గ్రామ సీపీఎం కార్యదర్శిగా బుడిగ ధనుంజయగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బుడిగ లింగయ్య, కటికోల అంజయ్య, వెంకటయ్య, సిరికొండ శ్రీను, సైదులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఆరో తరగతి విద్యార్థులకు పట్టణానికి చెందిన గజవల్లి వెంకటేశ్వర్లు సమకూర్చిన నోటు బుక్స్, పెన్నులను పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు పంపిణీ చేశారు.

● నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల, పెంచికల్‌దిన్నె గ్రామ పంచాయతీల సిబ్బందికి పెంచికల్‌దిన్న పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, ఎంపీవో హరిసింగ్ పాల్గొన్నారు.

● నేరేడుచర్ల మునిసిపాలిటీ కేంద్రంలో పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. నేరేడుచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాలను కలిపి సర్కిల్ కార్యాలయాన్ని, ఒక షీటీంను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వెంకట్, నాగరాజు పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని ఉమ్మడి భీల్యానాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు భిక్షంనాయక్ ఆకాల మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. భీల్యానాయక్‌తండాలో భిక్షంనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో డి.నవీన్‌నాయక్, వి.శ్రీనివాస్, భాస్కర్‌నాయక్, రాముడు, రాజునాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

● మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులుపాల్గొన్నారు.

గరిడేపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ఉపాధ్యాయులకు మినిమమ్ టైం స్కేల్ అమలు చేసి వారి సర్వీసును రెగ్యులర్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి తెలకపల్లి పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు..ఈ కార్యక మంలో పర్వతం సంధ్యారాణి, హరిప్రసాద్, రవీందర్‌రెడ్డి, తిరుమలేష్ శ్రీధర్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని తొగర్రాయి గ్రామంలో వరద బాధితుల నుంచి దరఖాస్తులను ఎంపీడీవో రామచందర్‌రావు స్వీకరించారు. మొత్తం 250 దరఖాస్తులు వచ్చాయని, వీటిని రెవెన్యూ అధికారులకు పంపుతామని ఎంపీడీవో తెలిపారు.. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలని పూర్వ విద్యార్థులు అన్నారు. కోదాడ మండలంలోని తొగర్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా ర్థులకు 2006-07 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆట వస్తువులను ఎంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హరికిషన్, అంజయ్య, సాజిద్, పూర్వవిద్యార్థులు రాజీవ్, వీరబాబు, వెంకటేష్, నారాయణ, సరేష్ తదితరులు పాల్గొన్నారు.

● కోదాడ డిపోలో డిపో ఉద్యోగుల జీవిత భాగస్వాములకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీహర్ష మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

మునగాల రూరల్: మండలంలోని ఆకుపాముల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ, ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్గిస్, ఏఎన్‌ఎం కవిత, పీహెచ్‌ఎస్ కృష్ణవేణి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు

చిలుకూరు: తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మండలంలోని నారాయణపురం గ్రామంలో ఊరచెరువు కట్ట వద్ద నివసిస్తున్న పలువురు గ్రామస్థులు తహసీల్దార్ ధ్రువకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తమ ఇళ్లు కొట్టుకుపోయాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు.

నూతన్‌కల్: మానవాళికి విజ్ఞానం ఎంతో ముఖ్యమని నాలుగు పర్యాయాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన డాక్టర్ పెండెం కృష్ణకుమార్ అన్నారు. మండలంలోని సోమ్లాతండా పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, క్రీడా సామగ్రి, దేశనాయకుల చిత్రపటాలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, సురేందర్ పాల్గొన్నారు.

● దేశంలో జమిలి ఎన్నికల పేరిట నియంతృత్వ పాలన తీసుకురావడానికి బీజేపీ యత్నిస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన్‌కల్ గ్రామ సీపీఎం కార్యదర్శిగా పొన్నం అబ్బయ్యను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కందాళ శంకర్‌రెడ్డి, బయ్య పూలమ్మ, ఉప్పలయ్య పాల్గొన్నారు..

● ప్రతి మండలానికి ఒక ఎంఈవోను ప్రభుత్వం నియమించడం హర్షనీయమని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య అన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో అబ్రహం, దేవేందర్, రవికుమార్ పాల్గొన్నారు.

నాగారం: 'స్వచ్ఛతా హీ' కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, టీబీ, రక్త పరీక్షలు నిర్వహించారు, కార్మికులకు అన్ని గ్రామపంచాయతీల్లో సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధార శ్రీనివాస్, ఎంపీవో మారయ్య, పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ నజీయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన మామిడి ఉమేష్, మహాత్మ యూత్ సభ్యులు రూ.5500లను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కోటేశ్వర్‌రావుకు అందజేశారు.

తిరుమలగిరి: జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే యూటీఎఫ్ 5వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సున్నమోజు సోమయ్య కోరారు. ఈ మేరకు తిరుమలగిరి జడ్పీహెచ్‌ఎస్‌లో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో దామెర శ్రీనివాస్, వెంకన్న, బోసు, ఉపేంద్ర, పాల్గొన్నారు.

తుంగతుర్తి: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగంధర్‌రావు తన 50వ పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. తుంగతుర్తిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గోపగాని రమేష్ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలోతాటి కొండ సీతయ్య, ఎండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, కడారి దాసు, మట్టిపల్లి వెంకట్, గోపగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నియర్ కళాశాలలో విద్యార్థులకు పర్యాటక ప్రదేశాలపైన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజమోహన్‌రావు,అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, పుల్లయ్య, గణేష్, మధుకర్, రాంబాబు, ప్రదీప్, అనీత, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.